ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY 5

జయశంకర్ భూపాలపల్లి

బుధవారం 2 ఏప్రిల్ 2025

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి : ఎస్పీ

కృష్ణకాలనీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లకు యువత దూరంగా ఉండాలని ఎస్పీ కిరణ్‌ఖరే పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించుకోవచ్చుననే భ్రమతో చాలా మంది బెట్టింగ్‌యాప్స్, గేమింగ్ యాప్స్‌లకు బానిసలుగా మారి, అప్పులపాలై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ప్లేకార్డ్, గేమ్స్ కట్టడికి జిల్లా పోలీసుశాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించి ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసిందన్నారు. బెట్టింగ్ యాప్‌ల డౌన్‌లోడ్ ద్వారా వ్యక్తిగత సమాచారం, అకౌంట్ వివరాలు సైబర్‌నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే అవకాశంఉందని తెలిపారు.

రజతోత్సవ సభపై బీఆర్ఎస్ ఫోకస్



ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో రజతోత్సవ సభపై సమీక్షిస్తున్న కేసీఆర్

- ఏర్పాట్లు, జనసమీకరణపై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో కేసీఆర్ సమీక్ష
- విభేదాలు పక్కన పెట్టి.. సభ సక్సెస్ అయ్యేలా చూడాలని సూచన
- ప్రతీ నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని ఆదేశం
- ఏర్పాట్ల వివరాలను అధినేతకు తెలిపిన నేతలు
- 154 ఎకరాల్లో సభాప్రాంగణం, 1,059 ఎకరాల్లో పార్కింగ్
- 10లక్షల మజ్జిగ ప్యాకెట్లు, మరో 10లక్షల వాటర్ బాటిళ్ల ఏర్పాటు
- సుమారు 5లక్షలకు పైగా జనసమీకరణ చేయాలని నిర్ణయం

వరంగల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్టీ రజతోత్సవం నేపథ్యంలో ఈనెల 27న నిర్వహించబోయే సభపై బీఆర్ఎస్ అధినాయకత్వం ఫోకస్ పెట్టింది. మంగళవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సభ నిర్వహణ, ఏర్పాట్లు, జనసమీకరణ తదితర అంశాలపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు సమీక్షించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద సభ ఏర్పాట్లపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్ కేసీఆర్‌కు వివరించారు. ఎల్కతుర్తి వద్ద 1,213 ఎకరాల స్థలాన్ని గుర్తించి, రైతుల నుంచి ఎన్‌వోసీలు తీసుకున్నామని తెలిపారు. ఇందులో 154 ఎకరాల్లో సభ నిర్వహించటం జరుగుతుందన్నారు. అలాగే మిగిలిన 1,059ఎకరాల్లో పార్కింగ్ కోసం కేటాయించామని, సుమారు 50వేలకు పైగా వాహనాలను ఇందులో పార్క్ చేసేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే సభకు వచ్చే ప్రజల కోసం 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లను, మరో 10లక్షల వాటర్ బాటిళ్లను సిద్ధం చేస్తున్నామని వారు పేర్కొన్నారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా 1,500మంది వలంటీర్లను నియమించామని తెలిపారు. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. తెలంగాణ ఉద్యమ

మిగతా 7వ పేజీలో...

హస్తం నేతల.. నారాజ్!

రేవంత్ జట్టులో ఓరుగల్లుకు మూడో బెర్త్‌పై సన్నగిల్లిన ఆశలు



రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఓరుగల్లు ఎమ్మెల్యేలు నారాజ్‌లో ఉన్నట్టు సమాచారం. కేబినెట్‌లో అవకాశం దక్కుతుందన్న ఆశతో ఉన్న వారికి చేదు అనుభవం తప్పేలా లేదు. ఢిల్లీ వెళ్లి లాబీయింగ్ చేసినప్పటికి మంత్రి పదవి దక్కే అవకాశం లేకపోవటంతో ఆశావాహులు నిరాశలో మునిగారు. ప్రధానంగా రెడ్డి సామాజికవర్గ ఎమ్మెల్యేలు మంత్రి పదవిపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు మహిళలు మంత్రులుగా ఉండగా, మరొకరు విప్‌గా బాధ్యత నిర్వహిస్తున్నారు. వారంతా రిజర్వుడు కోటాలోనే పదవులు పొందగా.. ఓసీ కోటాలో ఒక్కరికి కూడా పదవులు ఇవ్వకపోవటంపై అధిష్ఠానం వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వంలో ఎంతో కీలకమైన చీఫ్‌విప్ పదవిని వరంగల్ నేతల్లో ఒకరికి ఇచ్చేందుకు అధిష్ఠానం అంగీకరించిందని సమాచారం. ఈ క్రమంలో కేబినెట్ విస్తరణ ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఎలాంటి అలజడులకు కారణమవుతుందోనన్న చర్చ జరుగుతోంది.

- ఢిల్లీ వెళ్లిన ఎమ్మెల్యే మాధవరెడ్డికి అమాత్య అవకాశం అనుమానమే
- మంత్రి పదవి కోసం అధిష్ఠానంపై రెడ్డి సామాజిక వర్గం తీవ్ర ఒత్తిడి
- నలుగురమున్నా ఒక్కరికీ ఇవ్వడం లేదంటూ అసంతృప్తి
- ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ముగ్గురికి ఎలా ఇచ్చారంటూ ప్రశ్నలు
- పలు పరిణామాల నేపథ్యంలో పార్టీ పెద్దలు 'చీఫ్ విప్' హామీ ఇచ్చినట్టు సమాచారం
- రాములమ్మకు అవకాశాలూ అంతంతే..
- మంత్రివర్గ విస్తరణపై ఉమ్మడి జిల్లా శ్రేణుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సీఎం రేవంత్‌రెడ్డి రెండోసారి తన మంత్రివర్గాన్ని విస్తరిస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అనేక మంది ఎమ్మెల్యేల్లో ఆశలు చిగురించాయి. మంత్రి వర్గ విస్తరణలో తనకో బెర్తు దక్కుతుందనే ఆశతో ఎవరికి వారు తమ గాడ్‌ఫాదర్ల చుట్టూ చక్కర్లు కొట్టారు. అయితే కుల సమీకరణలు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంత్రివర్గంలో వరంగల్‌కు చోటు దక్కడం కష్టమనే సంకేతాలు వెలువడుతున్నాయి. దాంతో పలువురు నేతలు పెట్టుకున్న ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఏప్రిల్3వ తేదీ గురువారం మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారవడంతో ఆశావాహ ఎమ్మెల్యేలు, వారి అనుచరుల్లో ఉత్కంఠగా పెరుగుతోంది. ప్రధానంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలే ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ నేతలను కలిసి పార్టీ పట్ల తనకున్న విధేయతను గుర్తించాలని కోరారు. 2014లో నర్సంపేట నుంచి స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచినప్పటికి, బీఆర్ఎస్ నేతల ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్‌లో కొనసాగానని, తనకు మంత్రిగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా దొంతికి మద్దతుగా నిలిచారు. అయితే ఆరుగురిని మంత్రివర్గంలోకి తీసుకుంటుండగా, రెడ్డి సామాజిక వర్గం వారిలో నల్లగొండ నుంచి రాజగోపాల్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డికి అవకాశం ఇచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మరో రెడ్డికి అవకాశం దక్కుతుందా.. ఒకవేళ దక్కినా వరంగల్ జిల్లాకు చెందిన కొండా సురేఖ మంత్రిగా ఉండగా, ఇదే జిల్లా నుంచి దొంతి మాధవరెడ్డికి మంత్రి బెర్త్ దక్కుతుందా అనేది ఉత్కంఠగా మారింది. ఇక ఇటీవలే ఎమ్మెల్సీగా ఎన్నికైనా సినీనటి విజయశాంతి పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. వరంగల్‌కు చెందిన విజయశాంతికి మంత్రివర్గంలో సీటు దక్కితే రెండో బీసీ మహిళ మంత్రి అయ్యేవారు. అయితే

మిగతా 7వ పేజీలో...

మంత్రి పదవి కోసం రెడ్డి ఎమ్మెల్యేల పట్టు..

ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు మంత్రి పదవి ఇచ్చే విషయంలో అధిష్ఠానం వ్యవహరిస్తున్న తీరుపై కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఇప్పటికే వరంగల్‌కు రెండు మంత్రి పదవులు ఇచ్చామని, మూడో మంత్రి పదవి ఎలా ఇస్తారని అధిష్ఠానం పెద్దలు వరంగల్ ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్నారని సమాచారం. అయితే వరంగల్ కంటే అన్నిరంగాల్లో చిన్న జిల్లాలైనా ఖమ్మం నుంచి ముగ్గురికి, నల్గొండ నుంచి ముగ్గురికి ఎలా మంత్రివర్గంలో స్థానం కల్పించారని.. ఉమ్మడిఓరుగల్లుకు చెందిన ఆశావాహులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ నుంచి కూడా మూడో వ్యక్తికి.. అది కూడా రెడ్డి సామాజిక వర్గం ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. బీసీ, ఎస్టీ మహిళకు మంత్రులుగా, ఎస్టీ సామాజిక వర్గం నుంచి డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్‌కు విప్‌గా పదవులు ఇచ్చారని, రెడ్డి సామాజిక వర్గం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నప్పటికి ఒక్కరికి కూడా పదవి ఇవ్వకపోతే ఎలా అని కొందరు అధిష్ఠానం వద్ద తమ వాణిని బలంగా వినిపించారని తెలిసింది. ఒక్క నల్లగొండ జిల్లా నుంచే ముగ్గురు రెడ్డి సామాజిక వర్గ నేతలకు మంత్రి పదవులు ఇస్తే.. వరంగల్‌కు చెందిన రెడ్డి ఎమ్మెల్యేలకు ఇవ్వరా అని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడినట్టుగా తెలిసింది.

జలవనరులు కనుమరుగు

- ఎడారిలా మారిన మానేరు
- ఎత్తిపోతున్న ఫిల్టర్ బోర్లు
- మండుటెండలు, చెక్‌డ్యామ్‌లతో మాయమైన నీటి ప్రవాహం
- పంటలు కాపాడుకోవడానికి అన్నదాతల అష్టకష్టాలు



నీరు లేక ఎడారిని తలపిస్తున్న మానేరు నది

6

భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

- జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా
- తాడిచర్ల ఓసీ సందర్శన.. డేంజర్ జోన్ పరిశీలన

మల్హర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : తాడిచర్ల ఓపెన్‌కాస్టు డేంజర్ జోన్ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. తాడిచర్లలోని ఓసీపీని ఆయన మంగళవారం సందర్శించారు. జెన్‌కో, ఏఎమ్మార్ అధికారులతో కలిసి వ్యూపాయింట్ వద్ద నుంచి మైన్ స్థితిగతులను పరిశీలించారు. మైన్‌లో మరో ప్రాంతంలో ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ వద్ద నుంచి పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌ను పరిశీలించారు. అనంతరం క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులతో డేంజర్ జోన్ సేకరణ, కన్వేయర్ బెల్టు నిర్మాణం, మట్టి డంపుల ఎత్తు పెంచే అంశంతోపాటు పలు విషయాలపై చర్చించారు. ఈ ఏడాది నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడం పట్ల అధికారులను అభినందించారు. అలాగే మైన్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. డేంజర్ జోన్‌లోని ఇళ్లను, మిగులు భూములను సేకరించాలని కోరారు. బ్లాస్టింగ్ వల్ల ఇళ్ల బీటలు బారుతున్నాయని, దుమ్మూ దూళితో అనారోగ్య బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సీఎండీ సుల్తానియా మాట్లాడుతూ ఈ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. అందులో భాగంగానే మైన్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎమ్మార్ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్‌రెడ్డి, సీఈవో డీఎల్ఆర్‌కే ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లు విశ్వనాథరాజు, శ్రీధర్, జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య, కేటీపీపీ సీఈ శ్రీప్రకాశ్, ఏజెంట్ జీవకుమార్, జీఎం మోహన్‌రావు, అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్ రెడ్డి, జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి, జెన్‌కో, ఏఎమ్మార్ అధికారులు ఉన్నారు.

కేటీపీపీని సందర్శించిన జెన్‌కో సీఎండీ

గణపురం (ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టును జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా సందర్శించారు. ఈ సందర్భంగా మొదటి దశ 500మెగావాట్లు, రెండోదశ 600 మెగావాట్ల ప్రాజెక్టులను పరిశీలించారు. ఆయా విభాగాల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం సీఈ, ఎస్ఈలతో సమావేశమయ్యారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు నిల్వలు, రెండు ప్రాజెక్టుల పనితీరు, ఇంజనీరింగ్ అధికారుల పనితీరు, సమస్యలు, విద్యుత్ లక్ష్యాలను ఆరా తీశారు. కాస్ట్ ఆఫ్ జనరేషన్ తగ్గించుకోవడానికి పలు సూచనలు, సలహాలను అధికారులకు సూచించారు. ఆయన వెంట కేటీపీపీ చీఫ్ ఇంజనీర్ శ్రీప్రకాశ్, ఎస్ఈలు తదితర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.



వ్యూ పాయింట్ నుంచి డేంజర్ జోన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు



మొగుళ్లపల్లిలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఆహారభద్రత కల్పించి ఆకలి తీర్చడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రేషన్‌కార్డులపై సన్న బియ్యం అందించి మూడు పూటలా కడుపు నింపడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నిరుపేద కుటుంబానికీ సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. రేషన్‌కార్డులోని ఒక్కో కుటుంబ సభ్యుడికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ సంవత్సరన్నర కాలంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. గతంలో రేషన్‌బియ్యం పంపిణీ మాఫియాల ఆధ్వర్యంలో ఉండేవని, ఇప్పుడు వాటిని శాశ్వతంగా నిర్మూలించామని తెలిపారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 63మంది లబ్ధిదారులకు రూ.17,63,500 విలువచేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, సివిల్ సప్లయ్ అధికారి శ్రీనాథ్, జిల్లా మేనేజర్ రాములు, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, చిట్యాల ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎమ్డీ.రఫి, నాయకులు

మిగతా 8వ పేజీలో...

బయటకు రావాలంటేనే భయం

- భగ్గు మంటున్న భానుడు
- జిల్లాలో పెరిగిన ఎండలు
- 40 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత



నిర్మానుష్యంగా భూపాలపల్లి ప్రధాన రహదారి

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): భానుడు భగ్గు మంటున్నాడు. జిల్లాలో వేసవి తాపం తీవ్ర రూపం దాల్చింది. ఉష్ణోగ్రతలు విపరీతరంగా పెరుగుతున్నాయి. దీంతో జనం విలవిలలాడుతున్నారు. బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. తప్పనిసరి అయితే తప్ప.. తగిన జాగ్రత్తలతో గుమ్మం దాటుతున్నారు. ఏప్రిల్ ప్రారంభంలోనే ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటే.. మేలో పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూపాలపల్లి ప్రాంతంలో మంగళవారం 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేసవిలో ఇక్కడ సాధారణ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు ఉంటుండగా 40 డిగ్రీలకు చేరుకుందంటే.. మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. భూపాలపల్లి కోల్‌బెల్ట్ ఏరియా కాగా ఇతర ప్రాంతాల కంటే ఇక్కడ ఉష్ణోగ్రత ఎక్కువగానే ఉంటుంది. గతం కంటే ఇక్కడ వేడిమి ఎక్కువగానే ఉంటుందనే వాదనలు కూడా లేకపోలేదు. పర్యావరణ పరిరక్షణ లోపించడంతో పాటు పచ్చదనం రోజు రోజుకు తగ్గిపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అంతే కాదు.. అడవుల శాతం తగ్గిపోవడం కూడా మరో కారణమని పలువురు పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత

ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత కనిపిస్తోందని రోజువారీ కూలికి వెళ్లే కార్మికులు చెబుతున్నారు. ఎండ గతంలో కన్నా ఎక్కువ ఉందని అంటున్నారు. ఏప్రిల్, మే నెలల్లో అయితే బయటికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మే నెలలో 48 డిగ్రీల వరకు వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇప్పుడు ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. 124 ఏళ్లలో ఇంత ఎక్కువ ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే మొదటిసారి అని నిపుణులు చెబుతున్నారు. అయితే... దీనికి విరివిగా మొక్కలు పెంచడమే కాకుండా అడవులను రక్షించాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మానుష్యంగా రోడ్లు

అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు రోడ్డుమీదకు రావాలంటే జంకుతున్నారు. తలపై తువ్వాల చుట్టుకొని రావాల్సి వస్తోంది. మహిళలు చీర కొంగులు కప్పుకొని బయటకు వస్తున్నారు. మరికొందరు జనం గొడుగులతో వస్తుండగా ఇంకొందరు టోపీలు లేనిదే బయటకు రావడం లేదు. ఇలా తమను తాము రక్షించుకోవడానికి జాగ్రత్తలు పాటిస్తున్నారు. అత్యవసరం తప్ప ఎండవేడిమికి జనం బయటకు రాకపోవడంతో మధ్యాహ్నం పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.



ఎండలో స్కార్ఫ్‌లు, గొడుగులను వాడుతున్న మహిళలు

'అంబేద్కర్ అభయహస్తం' అందించాలి

దళితబంధు సాధన సమితి భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సంపత్

కాటారం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రతి దళిత కుటుంబానికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం లేదా కాంగ్రెస్ మెనిఫెస్టోలో పేర్కొన్న అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వర్తింపజేయాలని దళితబంధు సాధన సమితి భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నముండ్ల సంపత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఈ నెల 12న చేపట్టనున్న మహాధర్నాకు సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధనసమితి నేతలు ఆందోళనకు దిగారు. సంపత్ మాట్లాడుతూ ప్రభుత్వం దళితులకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పాలకులు ఎస్సీలను ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో రెండో విడతలో దళితబంధు కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు విడుదల చేసిన నిధులను ఈ ప్రభుత్వం వారికి కేటాయించాలన్నారు. కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అంబేద్కర్ అభయహస్తమైనా ఇవ్వాలన్నారు. దళితులకు భరోసా కల్పించే పథకాలకు నిధులు నిలుపుదల చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జక్కయ్య, జక్కయ్య, వెంకటయ్య, మధూకర్, చందు, లస్మయ్య, సంతోష్, రాజు, నగేష్, ప్రవీణ్, సతీష్, ప్రభాకర్, సత్యం, స్వర్ణలత, బొందమ్మ, రామన్న తదితరులు పాల్గొన్నారు.


విలీన సభలో మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమాన్ని ఇన్సూరెన్స్ కంపెనీలతో అప్పగించే చర్యలను తిప్పికొట్టి సంక్షేమబోర్డు అడ్వైజరి కమిటీలో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భట్టు అంజయ్య భవనంలో మంగళవారం రెండు కార్మిక సంఘాల విలీన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996లో వచ్చిందని, ఇందులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించ కుండా సంక్షేమ నిధులను ప్రభుత్వాలు దుర్వినియోగం చేస్తూ ప్రైవేట్ కంపెనీలకు దారాదత్తం చేస్తున్నాయని చెప్పారు. కార్మికులకు అందాల్సిన సంక్షేమ సౌకర్యాలను అమలు చేయకుండ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

భవన నిర్మాణ కార్మి కులకు హక్కులు, కనీస వేతనాలు, పించన్, పీఎఫ్ సౌకర్యాలు లేవని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్ల నిండిన కార్మికులకు రూ.6 వేల పించన్ సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 25,71, 880 మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, వారందరికీ ప్రభుత్వ సంక్షే మ ఫలాలు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జనార్దన్, సీతా రామయ్య, అనురాధ, మాదంశెట్టి నాగేశ్వరావు, గంట నాగయ్య, శివ్వారపు శ్రీధర్, హెచ్.లింగన్న, గౌని నాగేశ్వర్‌రావు, పర్వత కోటేష్, జబ్బార్, లక్ష్మయ్య, బాలమల్లు, మధు, శ్రీను, సురేష్, శ్రీనివాస్, రామన్న, సామ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారుల ఆగడాలను అరికట్టాలి


- జామాయిల్ చెట్లను నరికిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- వామపక్షాల నాయకులు డిమాండ్

వెంకటాపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని లింగాపూర్‌లో భూ ఆక్రమణలను అరికట్టాలని, జామాయిల్ చెట్లను నరికిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. లింగాపూర్ గ్రామశి వారులోని రైతుల భూములను సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు తుమ్మల వెంకటరెడ్డి, తోట మల్లికార్జునరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా రైతులు సాగుచేసుకుంటున్న భూములను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడానికి అనేక అరాచకాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. సర్వేనంబర్ 1864,1865లోని ఆరెకరాల భూమిలో జామాయిల్ చెట్లను నరికిన చింతల చరణ్, తైలం గౌతంసాగర్, తైలం నరేష్, సాగర్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో భూముల సమస్యలు పరిష్కారం కావాలంటే లింగాపూర్ నుంచి జవహర్‌నగర్ వరకు ఉమ్మడి సర్వే నిర్వహించి ఎంజాయ్‌మెంట్ లిస్ట్ ఆధారంగా ప్రతి రైతుకూ హక్కులు కల్పించాలన్నారు. ఈ సర్వే పూర్తిగా కలెక్టర్ ఆధ్వర్యంలో చేపడితేనే రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్డీ అమ్జద్‌పాషా, నాయకులు గఫూర్‌పాషా, సీపీఐ, సీపీఎం నాయకులు ముత్యాల రాజు, బండి నర్సయ్య, బోడ రమేష్, మామిడి నటరాజ్, రైతులు కంకల మల్లమ్మ, రమేష్, కొరిమి భూమిరెడ్డి, గుజ్జుల బాలకృష్ణ, రామిరెడ్డి, జంపాల మంజుల తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

జలవనరులు కనుమరుగు

- ఎడారిలా మారిన మానేరు
- ఎత్తిపోతున్న ఫిల్టర్ బోర్లు
- మండుటెండలు, చెక్‌డ్యామ్‌లతో మాయమైన నీటి ప్రవాహం
- పంటలను కాపాడుకోవడానికి అన్నదాతల అష్టకష్టాలు


మానేరు నది ఇసుక తెన్నెల్లో ఫిల్టర్ బోర్లు


ఫిల్టర్ బోరు డ్రిల్లింగ్ చేస్తున్న రైతులు

కాటారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒకసారి నది ఇసుక తెన్నెల్లో బోర్ వేస్తే హాయిగా మూడు నాలుగేళ్ల పాటు పంటలు పండించే అన్నదాతలకు వ్యయప్రయాసలు తప్పడం లేదు. కర్ణుడి చావుకు కారణాలు అనేకం అన్నట్టు మండుటెండలకు జలవనరులు కనుమరుగవుతున్నాయి. భూగర్భ జలాలు అడుగం టిపోతున్నాయి. ఆరు నెలలుగా వర్షాలు కురవకపోవడంతో పాటు అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలు, అక్కరకురాని చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో రైతులకు కష్టాలు ఎదురవుతున్నాయి. ఏడారిలా మారిన మానేరు నదిలో ఏడాదిలో రెండు పంటలు పండించడానికి వేసుకున్న ఫిల్టర్ బోర్లు ఎత్తిపోతున్నాయి. దీంతో మరింత లోతుగా బోర్లు వేసి రైతులు రాత్రీ పగలు నదిలోనే ఉండి పంటలు కాపాడుకునే పరిస్థితి తలెత్తింది..

వందలాదిగా ఫిల్టర్ బోర్లు

మానేరు పరీవాహక ప్రాంతంలోని వేలాది ఎకరాల్లో రైతులు ఏడాదిలో రెండు పంటలు పండిస్తుంటారు. ప్రధానంగా వానాకాలం, యాసంగిలో అధికంగా వరి, కొద్దిపాటి విస్తీర్ణంలో మొక్కజొన్న సాగవుతోంది. కాటారం మండలంలోని లక్ష్మీపూర్ నుంచి విలాసాగర్, గంగారం మొదలుకొని మల్హర్, మండలాల్లోని పలు గ్రామాల పరిధిలోని వేలాది ఎకరాలు మానేరు పరీవాహక ప్రాంతంలో ఉన్నాయి. వీటిలో పంటలు పండించడానికి మానేరు నదే ఆధారం. వానాకాలం మానేరులోని ఉపరితలంలో ఉన్న నీటిని వినియోగించుకుని పంటలు సాగుచేస్తుండగా యాసంగిలో మాత్రం మానేరు నది గర్భంలో డ్రిల్లింగ్ చేసే ఫిల్టర్ బోర్లు, పైప్‌లైన్లతో రైతులు పంటలు పండిస్తుంటారు. పలు గ్రామాల పరిధిలో ఫిల్టర్ బోర్ల ద్వారా ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పంట సాగైంది.

ఏడారిని తలపిస్తున్న మానేరు

గోదావరి నదికి ఉపనది అయిన మానేరు నది జిల్లా పరిధిలో చుక్క నీరు లేక ఏడారిలా మారింది. కొన్నేళ్లుగా మండు వేసవిలోనూ చిన్న పాయలాగా నీటి ప్రవాహాలు ఉండేవి. ప్రస్తుతం మానేరు నదిలో ఇసుక దిబ్బలు తప్ప చుక్క నీరు కనిపించడం లేదు. టేకుమట్ల మండలం నుంచి మొదలుకొని మల్హర్, కాటారం మండలాల పరిధిలోనూ మానేరు నీరు లేక బోరుమంటోంది.

రైతులకు వ్యయప్రయాస

గతంలో మానేరు ఒడ్డు సమీపంలోని ఇసుక దిబ్బలో సుమారు 10ఫీట్ల లోతునే ఫిల్టర్ బోర్ ఒకసారి డ్రిల్లింగ్ చేస్తే వరసగా మూడు నాలుగు యాసంగి సీజన్లు పంటలు పండించేలా పైప్‌లైన్ల ద్వారా నీరందించడానికి ఇబ్బంది ఉండకపోయేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మానేరు ఏడారిగా మారడం, అన్నారం బ్యారేజీలో నీటి నిల్వ శూన్యం కావడం, అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతుండటంతో ఫిల్టర్ బోర్లు ఎత్తిపోతున్నాయి. దీంతో నదిలో మరింత దూరంగా లోతుగా ఫిల్టర్ బోర్ డ్రిల్లింగ్ చేసే పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ యాసంగి సీజన్‌లో ఒక్కో రైతు మూడు, నాలుగు ఫిల్టర్ బోర్లు డ్రిల్లింగ్ చేయిస్తూ అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు. 25ఫీట్ల లోతులో ఇసుక లేకుండా రేగడిమట్టి వస్తుండటంతో మోటార్లకు నీరు అందని పరిస్థితి తలెత్తింది.

కనుమరుగవుతున్న నీటి ప్రవాహం

మానేరులో పలువురు అక్రమార్కులు అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. లక్షలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడేస్తుండటంతో మానేరు ఏడారిలా మారింది. గత ప్రభుత్వం హయాంలో పదుల కోట్ల నిధులతో ప్రయోజనం లేని చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో నీటి ప్రవాహాలు నిలిచిపోయి నది ఎండిపోయింది. చెక్‌డ్యామ్‌లు భారీ వర్షాలతో వరదలకు దెబ్బతినడంతో పరిస్థితి రెంటికీ చెడ్డరేవడిలాగా మారింది.

రాత్రింబవళ్లు నదిలోనే అన్నదాతలు

యాసంగి పంట నీటి తడులకు దెబ్బతినకుండా రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఏడారిలాగా మారిన మానేరు నదితో భూగర్భజలాలు అడుగంటిపోయి ఫిల్టర్ బోర్లు ఎత్తిపోతున్నాయి. రోజుల వ్యవధిలోనే ఫిల్టర్ బోర్లు మరోచోట డ్రిల్లింగ్ చేయడం, మోటార్లు సక్రమంగా నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు రాత్రింబవళ్లు మానేరు నదిలోనే ఉంటున్నారు. కుటుంబ సభ్యులు భోజనాలు, దుస్తులు తెస్తే అక్కడే స్నానపానాదులు చేస్తున్నా మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతు ఫిల్టర్ బోర్ల కోసం రూ. 20 వేల నుంచి 30వేలు అదనంగా ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని తమ ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.



నాలుగు ఫిల్టర్ బోర్లు వేశా..
చల్ల లింగయ్య, రైతు, గంగారం

గతంలో ఒక్కసారి 10-12ఫీట్ల లోతులో ఫిల్టర్ బోర్ డ్రిల్లింగ్ చేస్తే మూడు, నాలుగు పంటలు పండించేవాడిని. ఫిల్టర్ బోర్ ఎత్తిపోవడంతో ప్రస్తుతం యాసంగి వరిని కాపాడటానికి నాలుగుసార్లు ఫిల్టర్ బోర్ వేశా. దీంతో రూ.20 వేలు ఖర్చు అయింది. నదికి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న పొలానికి పైప్‌లైన్ ద్వారా నీరందించడానికి నానా యాతన పడుతున్నా.

ప్రతీ ఇంటికి తాగునీరందిస్తాం

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


బొంబాయికుంట చెరువులో ఉన్న బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) :గూడూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతీ ఇంటికి తాగునీరును అందిస్తామని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరు శివారు బొంబాయికుంట చెరువు ప్రాంతంలో ఉన్న నల్లాల బావి, పైపులైన్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూడూరులోని వివిధ వార్డు ప్రజలకు తాగునీరు అందించేందుకు పైపు లైన్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి శుభ్రమైన తాగునీటిని అందిస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇన్‌ట్రా ఏఈ దినేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బుడిగే సతీష్ గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి పాల్గొన్నారు. తొలుత గూడూరులో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.


బుద్దారం తండాలో బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గుడుంబా స్థావరాలపై దాడులు

ఐదుగురిపై కేసు నమోదు

గార్ల మార్చి 1 ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎక్సైజ్ పోలీసులు వరుస దాడులు నిర్వహించారు. మండలంలోని బుద్దారంతండా, మర్రిగూడెం గార్ల, తిర్లాపురం గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది మంగళవారం పెద్ద ఎత్తున దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బుద్దారం తండాలో 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకునట్లు ఎక్సైజ్ ఎస్సై అశోక్ తెలిపారు. మండల కేంద్రంలో అక్రమంగా బెల్లం విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అశోక్ హెచ్చరించారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది అచ్చు నాయక్, మధు, యాదగిరి పాల్గొన్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

డోర్నకల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన డోర్నకల్ మండలం కన్నెగుండ్లలో మంగళవారం చోటు చేసుకుంది. డోర్నకల్ ఏఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కన్నెగుండ్లకు చెందిన నిమ్మల రాధ (42) కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు మృతురాలి తల్లి బయ్య అనసూయమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. రాధకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

వివరాలు వెల్లడించిన సీఐ రాజేష్

డోర్నకల్ ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఒకరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్ మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెన్నారం గ్రామానికి చెందిన కోట నర్సయ్యపై ఉయ్యాలవాడకు చెందిన పెద్దిని అంజయ్య అనే వ్యక్తి దాడిచేసి కులం పేరుతో దూషించి నట్లు నర్సయ్య డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నర్సయ్య ఫిర్యాదు మేరకు పెద్దిని అంజయ్యపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో గర్భస్థ శిశువు మృతి

- మహబూబాబాద్‌లో గిరిజన సంఘాల రాస్తారోకో
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణ



ఆస్పత్రి వద్ద రాస్తారోకో చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు


మృతి చెందిన శిశువు

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ప్రసవానికి ప్రయత్నించగా.. సాధ్యం కాకపోవడంతో ఆపరేషన్ చేయగా.. అప్పటికే గర్భంలోని శిశువు మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరిగింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ మునిసిపాలిటీ శివారులోని శనిగపురం భట్టుతండాకు చెందిన బానోత్ జయశ్రీకి పురిటినొప్పులు రావడంతో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారు. కానీ అర్ధరాత్రి తర్వాత రక్తస్రావకం అధికంగా కావడంతో, ఆపరేషన్ చేయాలని నిర్ణయించుకుని మంగళవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో శస్త్రచికిత్స చేసి మగశిశువును బయటకు తీశారు. కానీ అప్పటికే ఆశిశువు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయాన్ని తెలుసుకున్న సేవాలాల్‌సేన, ఎల్‌హెచ్‌పీఎస్ తదితర గిరిజన సంఘాల నాయకులు ఆస్పత్రికి చేరుకుని డాక్టర్ల నిర్లక్ష్యంతోనే శిశువు గర్భంలోనే మృతి చెందాడని ఆరోపించారు. ముందుగానే పరిస్థితి గుర్తించి ఉంటే ఈ ఘటన జరిగేది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి నచ్చజెప్పడంతో గిరిజన సంఘాల నాయకులు ఆందోళన విరమించారు. ఆ తర్వాత గిరిజన సంఘాల నాయకులు ఆస్పత్రి అదనపు ఆర్ఎంవోకు ఫిర్యాదు చేశారు. ఈ ఆందోళనలో సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ దారావత్ వెంకన్న, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బోడ రమేష్, నాయకులు మోతీలాల్, నందులాల్, రాజునాయక్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మొరం తరలింపు

వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఎక్స్‌కవేటర్ యజమానులు


గాంధీనగర్ శివారులో మొరం తీస్తున్న ఎక్స్‌కవేటర్

కొత్తగూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ మండలంలో వాల్టా చట్టానికి ఎక్సకవేటర్ యజమానులు తూట్లు పొడుస్తున్నారు. మండల కేంద్రం సమీపంలో ఇంత యథేచ్ఛగా మొరం దందా జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. కొత్తగూడ మండల కేంద్రం సమీపంలోని గాంధీనగర్ శివారులో ఎక్సాకావేటర్ యజమాని ఆదివాసీ రైతుల అమయాకత్వాన్ని ఆసరాగా చేసుకుని మాయమాటలు చెప్పి యథేచ్ఛగా మొరం దందా చేస్తున్నారు. ఈ విషయంలో ఇటీవల తుడుందెబ్బ నాయకులు సైతం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి హెచ్చరించారు. అయినా తీరు మార్చుకోకుండా తాజాగా మంగళవారం గాంధీనగర్ శివారులో ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా మొరం తరలించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వెళ్లి ఎక్స్‌కవేటర్ నిలిపివేసి, మొరం తరలించొద్దని హెచ్చరించారు. కాగా గాంధీనగర్ శివారులో ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా మొరం తరలింపును నిలిపి వేసి విచారణ చేయాలని ఆర్ఐని ఆదేశించానని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. విచారణ నివేదిక రాగానే ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేస్తామని తెలిపారు.


ట్రాక్టర్‌లో తరలిస్తున్న మొరం

హెల్త్ సూపర్‌వైజర్ దారుణ హత్య

- మహబూబాబాద్ జిల్లాలో ఘటన
- మృతుడిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల
- సోదరి ఫిర్యాదుతో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామ పరిధిలోని భజనతండ శివార్లలో దంతాలపల్లి జ్యోతిరావుఫూలే పాఠశాల హెల్త్ సూపర్‌వైజర్ తాటి పార్థసారథి (42) దారుణ హత్యకు గురయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లకు చెందిన పార్థసారథి కుటుంబం కొంతకాలంగా భద్రాచలంలోని జగదీష్‌నగర్ కాలనీలో నివాసముంటోంది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఏడాది నుంచి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి జ్యోతిరావుఫూలే పాఠశాలలో హెల్త్‌సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన.. ఉగాది పండుగకు గాను భద్రాచలం వెళ్లి.. సోమవారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై దంతాలపల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన తర్వాత అయోధ్య పరిధిలోని భజనతండ శివారులోని మిర్చి తోట వద్ద రాత్రి 11:30, 12 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డగించి గొడ్డలితో తలపై నరికి చంపారు. అయితే తెల్లవారుజామున ఆ దారి గుండా వెళ్లేవారు ఇచ్చిన సమాచారంతో విషయం వెలుగులోకి రాగా.. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య హుటాహుటిన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూజ్‌టీంలను రంగంలోకి దింపి పలు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతదేహాన్ని మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి రాత్రికి పోస్టుమార్టం నిర్వహించారు. అయితే అయోధ్య గ్రామ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశం కాగా.. మృతదేహాన్ని చూసేందుకు అధికసంఖ్యలో స్థానికులు అక్కడికి చేరుకున్నారు.

పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

తన సోదరుడి హత్య విషయం తెలుసుకున్న పార్థసారథి సోదరి హేమ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఆమె చేసిన పలు ఆరోపణలు అనుమానాలకు తావిస్తున్నాయి. తన అన్న పార్థసారథి.. ఏడాది క్రితం భద్రాచలంలోని బీపీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే ఒకసారి కొందరు హత్య చేసేందుకు వెంట పడ్డారని.. అప్పుడు తప్పించుకున్నాడని, ఈ ఘటనపై అప్పట్లో అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆమె వెల్లడించారు. అంతేకాకుండా కొంతకాలంగా తన అన్న, వదిన స్వప్న మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయని, ఈ హత్యలో తన వదిన ప్రమేయం ఉండి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. ఈ లోపే భర్త పార్థసారథి హత్య గురించి తెలుసుకుని భద్రాచలం నుంచి వచ్చిన స్వప్నను ప్రశ్నించిన పోలీసులు.. పలు వివరాలు సేకరించారని తెలుస్తోంది. ఆ తర్వాత కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేసిన మహబూబాబాద్ రూరల్ పోలీసులు హత్యలో భద్రాచలానికి చెందిన వ్యక్తుల ప్రమేయం ఉండిఉండొచ్చని భావిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసుల బృందం భద్రాచలం వెళ్లినట్టు సమాచారం. అయితే పార్థసారథిని హత్య చేసేందుకు భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి దుండగులకు సుపారీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్థసారథి హత్యకు గల కారణాలను తెలుసుకుని త్వరితగతిన కేసును ఛేదించేందుకు పోలీసులు విస్తృతంగా విచారణ జరపుతున్నట్టు తెలుస్తోంది.



హత్యకు గురైన పార్థసారథి మృతదేహం (ఇన్‌సెట్‌లో హతుడు)

నేటి బాల్యం.. సాహిత్యానికి దూరం!

నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం



సాంకేతికత, కార్పొరేట్ విద్యాచట్రంలో పిల్లలు



- కేవలం పాఠ్యాంశాలకే పరిమితమవుతున్న వైనం
- వ్యక్తిత్వ వికాస పుస్తకాలకు దూరమవుతున్న చిన్నారులు
- మునుపటి రోజుల్లో బాలల కోసం ప్రత్యేక పుస్తకాలు
- నేటికీ బాలసాహిత్యంలో వాణిశ్రీ విశేష కృషి
- ఆరు దశాబ్దాలుగా చిన్నారుల సేవలో బాలల గ్రంథాలయం

హనుమకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వగలిగిన అమూల్యమైన ఆస్తి మంచి పుస్తకం. పుస్తకం అమ్మలా లాలిస్తుంది. నాన్నలా ఆదరిస్తుంది. గురువులా తీర్చిదిద్దుతుంది. చదివే మెదళ్లకు పదును పెడుతుంది. కథల పుస్తకాలు పిల్లల్లో ఏకాగ్రత, సృజనాత్మకతను పెంపొందిస్తే.. మహానుభావుల విజయగాథలు, ఆత్మకథలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. అయితే ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు కార్పొరేట్ విద్యాచట్రంలో బందీ అవుతున్న వేళ వారు పాఠ్యేతర పుస్తకాలకు దూరమవుతున్నారు. కేవలం సబ్జెక్టు పుస్తకాలకే పరిమితమవుతున్న బాలలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే పుస్తకాలను చదివే పరిస్థితి లేకుండాపోయింది. ఇక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా వారికి ఆ దిశగా సూచనలు కూడా చేయడం లేదు. ఇక మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న విస్తారమైన బాలసాహిత్యమే పిల్లలకు విజ్ఞాన, వినోదాన్ని అందిస్తోంది. బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం.

పఠనాసక్తిని పెంచేందుకు..

పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, వారితో పాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యంవైపు ఆకర్షించడం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం లక్ష్యం. 1967నుంచి ఏటా ఏప్రిల్ 2న అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని జరుపుతున్నారు. డెన్మార్క్‌కు చెందిన ప్రఖ్యాత బాల సాహిత్య రచయిత హాన్స్ క్రిస్టియన్ అండర్సన్ పుట్టిన రోజు ఇది. తెలుగులో తొలిసారిగా 1875-85 మధ్య కాలంలో జనవినోదిని పత్రిక బాలల కోసం ప్రత్యేక రచనలను ప్రారంభించింది. 1947లో నాగిరెడ్డి చందమామ ప్రారంభించారు. బాలసాహిత్యానికి చందమామ చేసిన సేవ వెలకట్టలేనిది. చందమామ తర్వాత బాలమిత్ర, బొమ్మరిల్లు, బుజ్జాయి లాంటి పత్రికలు అలరించాయి. తెలుగు రచయితల్లో చాలా మంది సుప్రసిద్ధులు బాలసాహిత్యానికి ఎనలేని సేవలందించారు. న్యాయపతి రాఘవరావు, ఏడిద కామేశ్వర్‌రావు, తురగా జానకీరాణి, రావూరి భరద్వాజ, ఇల్లిందల సరస్వతీ దేవి లాంటివారు బాలల కోసం ప్రత్యేకంగా రచనలు చేశారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాదారపు వాణిశ్రీ తదితరులు బాలసాహిత్యం కోసం కృషి చేస్తున్నారు. అలాగే సాహిత్య అకాడమీలు, సాక్షర భారత్, సర్వశిక్ష అభియాన్ లాంటివి కూడా పిల్లలకు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ప్రచురిస్తున్నాయి. కానీ ప్రస్తుతం చిన్నారులు పుస్తకాల ను పక్కనపెట్టి సామాజిక మాధ్యమాలకు అతుక్కు పోతు న్నారు. ఫలితంగా పిల్లల్లో సహజ ఎదుగుదల మందగిస్తోంది.

ఈ క్రమంలో పుస్తక పఠనాన్ని తల్లిదండ్రులు, పెద్దలు బాధ్యతగా స్వీకరించి నేటి తరం పిల్లలకు చిన్నప్పటి నుండే అలవాటు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాలల కథా రచయిత్రి వాణిశ్రీ



మాదారపు వాణిశ్రీ

పిల్లల కోసం పుస్తకాలు రాస్తున్నవారిలో మాదారపు వాణిశ్రీ ఒకరు. ఓరుగల్లుకు చెందిన వాణిశ్రీ బాలల కోసం కథ, నవల, గేయం కవిత రాయడమే కాకుండా ఒకే రోజు ఒకే వేదికపై ఆరు పుస్తకాలను ఆవిష్కరించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. తిరుగనగిరి వేదాంత సూరి ప్రోత్సాహంతో మూడున్నర దశాబ్దాలుగా బాల సాహితీవేత్తగా సరదా కాసేపు, చిచ్చుబుడ్లు, సెలవుల్లో పట్నం పిల్లలు.. లాంటి నవల తో పాటు పూటకుళ్లవ్వ సీరియల్ తదితర రచనలు చేశారు. బాలలకు ఒక చోట అందించేందుకు వీటన్నిటిని ఒక సంకలనంగా పుస్తకాన్ని అందుబాటులోకి తెచ్చారు. సరదాగా కాసేపు, చిచ్చుబుడ్లు, సెలవుల్లో పట్నం లాంటి రచనల్లో ఆమె బాలల కోసం వారి బాగు కోసం అనే అంశాలను పొందుపరిచారు. బాలల మనస్తత్వాలను అద్దం పట్టారు. కేవలం ఆనందం గా, సరదగా చదువుకునే కథలేకాక పిల్లలను అపహరించే మాఫియా గురించి కూడా ప్రస్తావిస్తారు. విదేశాల్లో ఉండే పిల్లల కోసం పల్లెల్లో ఒంటరిగా తపించే తల్లిదండ్రుల తండ్లాటను కూడా వివరించారు. మన జీవన మూలాలకు ఆద్యమైన భారతం, భాగవతం, రామాయణం లాంటివాటి ని పరిచయడం చేయాలన్న తపన కూడా ఆమె కథల్లో కనిపిస్తుంది. ఇక బాలల కథల పుస్తకాన్ని తన కుమారుడికి అంకితం చేయడం రచయిత్రి ఔచిత్యానికి తార్కాణం. తెలివైన గడుగ్గాయ్, మందబుద్ధి, చిచ్చుబుడ్లు, పరుగు లాంటి కథలు సామాజిక స్పృహకు అద్దంపట్టగా.. ముఖ్యంగా సెలవుల్లో పట్నం పిల్లలు పుస్తకం బాలలను ఎంతగానో చదవిస్తుంది. పట్నం పిల్లలు సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వచ్చినప్పుడు వారు ఆడే ఆటలు, పొందే అనుభూతిని ప్రస్ఫుటించారు. వాణిశ్రీ కథలు, నవలలే కాక చక్కని బాల గేయాలను కూడా రచించారు. వివిధ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ఆమె బాల గేయాలు ప్రచురితమయ్యాయి. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రచురించిన ఆరోగ్యం-విజ్ఞానం పుస్తకంలో బాలల విజ్ఞానం కోసం సిరి ధాన్యాల గురించి రాసిన వ్యాసానికి ప్రత్యేక పురస్కారాన్ని అందుకున్నారు. హిందీలోకి అనువదించిన 20బాలల ఉత్తమ కథా సంకలనంలో వాణిశ్రీ రాసిన పొదుపు కథ చోటు దక్కించు కుంది. ప్రస్తుతం మణికొండ వేద కుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న దక్కన ల్యాండ్ మాసపత్రిక చెలిమి పేజీలో వాణిశ్రీ రచించిన పూటకూళ్లవ్వ ధారావాహిక కథ గత నెల నుంచి ప్రచురితమవుతోంది. ఆమె బాల సాహిత్యం, బాలల గురించి చేసిన పలు ప్రసంగాలు ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. క్రాంతి మేఘాలు కథకు బాల చెలిమి సంస్థ ఉత్తమ బాలల కథా పురస్కారం అందుకున్నారు. చిచ్చుబుడ్లు కథా పుస్తకానికి భువన సాహిత్య విజ్ఞాన వేదిక ద్వారా ఉత్తమ కథా పుస్తకంగా జాతీయ ఉగాది పురస్కారం పొందారు.



బాలల కోసం మాదారపు వాణిశ్రీ రాసిన పుస్తకాలు

ఆరు దశాబ్దాలుగా బాలల సేవలో.. గ్రంథాలయం..



హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని బాలల గ్రంథాలయం

హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని బాలల గ్రంథాలయం ఆరు దశాబ్దాలుగా బాలల సేవలో తరిస్తోంది. వారి అభిరుచికి తగ్గట్టుగా ఎన్నో పుస్తకాలను అందుబాటులో ఉంచుతోంది. ఆట పాటల కోసం పబ్లిక్ గార్డెన్‌కు వచ్చే పిల్లలకు పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచాలన్న ఆలోచనతో 1967లో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. గార్డెన్‌లో పచ్చని చెట్లు, ఆహ్లాకరమైన వావరణం మధ్య ఉన్న ఈ గ్రంథాలయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7గంటల వరకు పని చేస్తుంది. రోజూ సుమారు 100 నుంచి150మంది పిల్లలు ఇక్కడి వస్తుంటారు. ఇక్కడ మొత్తం 17,994 పుస్తకాలు ఉండగా.. బాలల కోసం ప్రత్యేకంగా 3వేలకుపైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. తొలుత ఈ గ్రంథాలయాన్ని పిల్లల కోసమే ప్రత్యేకించినా తర్వాత కాలంలో పెద్దల ను కూడా అనుమతిచ్చారు. దీంతో పిల్లలకు తోడుగా వచ్చే తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో పాటు ఇటీవల గ్రూప్ పరీక్ష కోసం సిద్ధమయ్యే వారి కోసం కూడా పుస్తకాలను అందుబాటులో ఉంచారు. పిల్లలు చదువుకోవడానికి అనువుగా ప్రత్యేకంగా కుర్చీలు, బెంచీలు ఇతరత్రా సౌకర్యాలను ప్రత్యేకంగా కల్పించారు. ఇక పిల్లలకు అందే ఎత్తులోనే పుస్తకాల సెల్ఫ్‌లను ఏర్పాటు చేశారు.

డిజిటల్ స్టోరీ బాక్స్..

పబ్లిక్ గార్డెన్స్‌లోని పిల్లల గ్రంథాలయానికి వచ్చే చిన్నారులు తమకు ఇష్టమైన పుస్తకాలతో పాటు కథలను చదువుకోవడానికి వీలుగా వారి కోసం డిజిటల్ స్టోరీ బాక్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. పిల్లలు ఏవైనా మూడు పుస్తకాలను ఎంచుకొని అందులో తమకిష్టమైన కథలను ఎంచుకుంటే అవి ఈ బాక్స్ నుంచి ప్రింట్ అవుట్ రూపంలో బయటకొస్తాయి. అలాగే పిల్లలతో ఏ పుస్తకాలను చదివించాల నేది తల్లిదండ్రులు నిర్ణయించుకొని ఆ పుస్తకాలను ఎంపిక చేసి ఇచ్చేందుకు పుస్తకాల కేటలాగ్ అందుబాటులో ఉంది. రామాయణ, భారత ఇతిహాసాలతో పాటు సైన్స్ ఫిక్షన్, కామిక్ తదితర అన్ని రకాల పుస్తకాలు ఈ బాలల గ్రంథాలయంలో అందు బాటులో ఉన్నాయి. గతంలో ఈ బాలల గ్రంథాలయం పాత రేకుల షెడ్డులో ఉండగా.. ఇటీవల పబ్లిక్ గార్డెన్‌ను ఆధునికీకరించిన క్రమంలో వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని హంగులతో కూడిన విశాలమైన భవనాన్ని నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో బాలల కోసం ప్రత్యేకంగా నడుస్తున్న ఏకైక గ్రంథాలయం ఇదేనని, మారుతున్న కాలానికి అనుగుణంగా బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి, వారి వ్యక్తిత్వ నిర్మాణానికి, జిజ్ఞాసను పెంచడానికి దోహదపడే పుస్త కాలు ఇక్కడ ఉన్నాయనీ లైబ్రేరియన్ అశోక్ తెలిపారు. ఈ బాలల గ్రంథాల యానికి 60ఏళ్ల అపరూపమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు.

ఆగం చేస్తున్న.. ఆటిజం

ప్రతీ 20 మంది చిన్నారుల్లో ఒకరికి సమస్య

- పిల్లలను సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లకు దూరంగా ఉంచాలి
- బయటకు కనిపించే మానసిక వ్యాధి
- ముందుగా పసిగడితే మంచిది



నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు చంద మామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ.. దాంతో ఆరోగ్యంగా పెరిగేవారు. కానీ ఆ అమ్మ ఆధునిక కాలంలో సెల్‌ఫోన్ చేతికిచ్చి ముద్దలు తినిపిస్తోంది. ఇక నాన్నేమో ట్యాబ్ చూపిస్తూ లాలపోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న పిల్లలు పసితనంలోనే అనేక రుగ్మతలకు గురవుతున్నారు. సమాజంలో పెరుగుతున్న సాంకేతికత కొన్ని రకాల వ్యాధులకు కారణమవుతోంది. అందులో ఒకటి ఆటిజం.

సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగే కొద్ది ఆటిజం సమస్య కూడా పిల్లలను పట్టిపీడిస్తోంది. చాప కింద నీరులా విస్తరిస్తున్న ఆటిజం సమస్యపై ప్రత్యేక కథనం.

కారణాలు ఇవే..

ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేక కారణమంటూ లేదు. సాధారణంగా 9నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతోపాటు గ్రహించడం భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయస్సులో చిన్నారులకు ఫోన్లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు చేయడంవల్ల భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. మొదటి మూడేళ్ల వరకు పిల్లలకు ఫోన్లు, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటు పడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. బహుళ భాషలు నేర్చుకోవాల్సి రావడం పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల పిల్లలు ఏ భాషను కూడా స్వీకరించకపోయే అవకాశం ఉంటుంది. యాంటీ బయోటిక్స్ లాంటివి ఎక్కువగా వాడటం కూడా ఈ సమస్యకు దారి తీయొచ్చు. ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ ఎక్కువగా కనిపిస్తుంది.

ఆటిజం అంటే ఏమిటీ?

ఆటిజం అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి. పిల్లలకు మొదట్లో మాటలు వస్తాయి. కానీ రెండేళ్లు వచ్చేసరికి ఆ మాటలు ఆగిపోతాయి. దీనినే రిగ్రేషన్ అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేళ్లలోపు ఇది జరుగుతుంది. ఆటిజం పిల్లలు భావాలను వ్యక్తపర్చడంలో విఫలమవుతుంటారు. సరిగా మాట్లాడలేకపోవడంతో పాటు ఎదుటివారి భావాలను గ్రహించలేరు. సామాజిక బాంధవ్యాలు కూడా తెలియని స్థితిలో ఉంటారు. ఇతరులతో కలిసి ఆడుకోవడం కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా మాత్రమే ఉండడాన్ని కోరుకుంటారు. చేసిన పని మళ్లీ మళ్లీ చేస్తూ ఉంటారు. ఇలాంటి చిన్నారుల్లో మానసిక పరిణితి చాలా తక్కువగా ఉంటుంది. ఇలాంటి లక్షణాలన్ని ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ లక్షణాలున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.

ఒంటరితనం కూడా ఇబ్బందే..

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్య, అత్తయ్య, చిన్నమ్మ, చిన్నాన్న, పిన్ని ఇలా అనేక మంది పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల ఊసేలేదు. పైగా ఆ రోజుల్లో మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. ఆధునిక కాలంలో ఉమ్మడి కుటుంబాలు కరువయ్యాయి. నూటికి 90శాతం విడిగా ఉండే కుటుంబాలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరు ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తుంది. ఇలాంటి కుటుంబ వాతావరణ పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీస్తుంది.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి



పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎదుగుతున్న కొద్ది వారిలో వస్తున్న మార్పులు కచ్చితంగా గమనించాలి. మొద టి మూడేళ్లలో ఆటిజం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదిం చాలి. మెదడు పనితీరుకు సంబంధించిన లోపం వల్ల ఇది సంభవిస్తుంది. తోటి వారితో కలవకపోవడం, సరిగ్గా మాట్లాడకపోవ డం, భావ ప్రకటనల్లో లోపాలు ఈ వ్యాధి లక్షణాలుగా భావించాలి. ఈ వ్యాధిని పరిశీలిస్తూ పరిష్కారం దిశగా చికిత్స అందించాల్సి ఉంటుంది. చికిత్సతో మార్పు సాధ్యమే.

- డాక్టర్ కె.వినయ్ కుమార్‌గౌడ్, న్యూరో ఫిజీషియన్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కాకతీయ మెడికల్ కాలేజీ

వ్యాధి లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కళ్లలోకి నేరుగా చూడలేకపోవడం.
- పేరు పెట్టి పిలిచిన వెంటనే స్పందించకపోవడం.
- ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడటం.
- ఒకేరకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మను ఇస్తే తీసుకోకపోవడం.
- కొందరు పిల్లలోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబద్ధంగా ఉంటుంది.

రోగ నిర్ధారణ, చికిత్స పద్ధతులు

ప్రత్యేక లక్షణాలు కల్పించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గాని, లోక నిర్ధారణ పద్ధతులు గాని అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు మాత్రమే కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలుగుతారు. ఈ ఆటిజం లక్షణాలను ఎంత త్వరగా గుర్తిస్తే నివారణ అంత సులువుగా ఉంటుంది. ఆరు నెలల్లోనే 50శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం మూడేళ్లలోపు సమస్యలు గుర్తించి చికిత్స అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ మూడేళ్ల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఇలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చునని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, స్పీచ్ థెరపీ ద్వారా ఆటిజానికి చికిత్స అందిస్తారు.

ఉద్రేకపూరిత ప్రవర్తన ఉంటే అప్రమత్తత అవసరం



మూడేళ్లలోపు పిల్లల్లో ఉద్రేకపూరిత ప్రవర్తన ఉంటే అప్రమత్తం కావాల్సిందే. ఒంటరిగా ఉండటం, అతిగా స్పందించడం, నలుగురితో ఆడలేకపోవడం లాంటివి ఆటిజం లక్షణాలుగా గుర్తించాలి. ఈ తరహా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. దేశంలో ప్రతీ 68మంది పిల్లల్లో ఒకరు బాధితులుంటున్నారు. త్వరితగతిన గుర్తిస్తే చికిత్స సులభతరం బిహేవియర్ థెరపీ, మెడికేషన్, పేరంటల్ కౌన్సెలింగ్‌తోపాటు ప్రత్యేక పద్ధతుల్లో విద్యాబోధన అందించడం ముఖ్యం. ఈ వ్యాధి నిర్మూలనలను సామాజిక బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం ఉంది.

- డాక్టర్ ఏ.రాకేశ్ కుమార్, సైకియాట్రిస్ట్

రజతోత్సవ సభపై బీఆర్ఎస్ ఫోకస్

5వ పేజీ తరువాయి)

సమయంలో వరంగల్ కేంద్రంగా నిర్వహించిన విశ్వరూప మహాసభ విజయవంతమైన స్ఫూర్తితో రజతోత్సవ సభను సక్సెస్ చేస్తామని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో మాట్లాడుతూ.. ఎల్కతుర్తి వద్ద సభావేదిక ఏర్పాటు చేయటం బాగుందని, వరంగల్, కరీంనగర్, సిద్ధిపేట ఉమ్మడి జిల్లాల కూడలిలో ఈ వేదిక ఉండటం జనసమీకరణకు సులభంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ మూడు జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో సభకు జనాన్ని తరలించాలన్నారు. 27వ తేదీన నాటికి ఎండలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కేసీఆర్ వారికి సూచించారు. గురువారం నుంచి ప్రతీ నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో జనసమీకరణ జరగాలన్నారు. సభ నిర్వహణకు కావాల్సిన 20కి పైగా కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలని కేసీఆర్ సూచించారు.

వర్ధన్నపేట బాధ్యతలు ఎర్రబెల్లికే..

మార్చి 28న 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడి జిల్లా సంచికలో 'గడబిడల గులాబీ' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో పార్టీలో విభేదాలను పక్కన పెట్టాలని కేసీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు హితవు చెప్పారు. వర్ధన్నపేట నియోజవర్గంలో జనసమీకరణ బాధ్యతలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చూసుకుంటారని, ఇప్పుడే ఇన్‌చార్జ్ బాధ్యతల కోసం గొడవలు ఎందుకని.. నియోజకవర్గాల పునర్విభజన తరువాత చూద్దామంటూ నేతలకు సర్దిచెప్పినట్టు సమాచారం. అంతేకాకుండా భూపాలపల్లి జనసమీకరణ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి చూసుకోవాలని, పార్టీలో ఎలాంటి విభేదాలు లేకుండా రజతోత్సవ సభను సక్సెస్ చేయాలని కేసీఆర్ కోరారు. కాగా, పార్టీ రజతోత్సవ సభ నిర్వహణ వరంగల్‌కు అప్పగించటంపై ఉమ్మడి జిల్లా నేతలు కేసీఆర్‌కు ధన్యావాదాలు తెలిపారు.

ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మండలిలో విపక్షనేత సిరికొండ మధుసూధనాచారి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రులు తాటికొండ రాజయ్య, సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, భూపాలపల్లి, ములుగు జిల్లాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు గండ్ర జ్యోతి, బడే నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు, చిత్రంలో కేటీఆర్ తదితరులు

హస్తం నేతల.. నారాజ్!

(5వ పేజీ తరువాయి)

మారిన సమీకరణలో రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో రాములమ్మకు కూడా బెర్త్ దక్కటం అంతా ఈజీ కాదనే చర్చ జరుగుతోంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సైతం మంత్రివర్గంలో స్థానం కోసం ప్రయత్నాలు చేసినా తొలిసారి ఎమ్మెల్యే కావటంతో ఛాన్స్ లేకుండా పోయిందనే టాక్ ఉంది. మొత్తానికి గురువారం జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో ఓరుగల్లు నేతలకు ఛాన్స్ దక్కటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

చీఫ్‌విప్ అయినా దక్కేనా..?

మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలకు బెర్త్ దక్కటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అధిష్ఠానం కేబినెట్ ర్యాంకుతో ఎంతో కీలకమైన చీఫ్‌విప్ పదవి ఇస్తామని భరోసా ఇచ్చిందనే చర్చ జరుగుతోంది. రెడ్డి సామాజిక వర్గం ఎమ్మెల్యేల్లో ఒకరికి చీఫ్‌విప్ పదవి ఇస్తే.. అది ఎవరికి అనేది కూడా ఉత్కంఠగా మారింది. మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న దొంతి మాధవరెడ్డికి చీఫ్‌విప్‌లాంటి కీలక పదవిని సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. సీఎంతో మాధవరెడ్డికి సంబంధాలు అంతంతే ఉండటంతో.. శాసనసభలో కీలకమైన పదవి కావటంతో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి లేదా నాయిని రాజేందర్‌రెడ్డిల్లో ఒకరికి అవకాశం ఇస్తారనే చర్చ ఉంది. అయితే మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని వీడకుండా, ఇతర పార్టీల ఆఫర్లను కూడా లెక్క చేయకుండా పని చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వైపు మొగ్గు చూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక రాజేందర్‌రెడ్డికి డిప్యూటీ స్పీకర్ ఇవ్వాలని నిర్ణయించినప్పటికి, నల్లగొండ జిల్లాకు చెందిన ఓ నేతకు ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించిందని, దీంతో రాజేందర్‌రెడ్డి లేదంటే ప్రకాష్‌రెడ్డికి చీఫ్‌విప్ పదవి దక్కే అవకాశం ఉందనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. అయితే కాంగ్రెస్‌లో ఏ క్షణాన ఏం జరుగుతుందో అని, కనీసం ఈ పదవైనా వరంగల్ రెడ్డి సామాజిక వర్గ ఎమ్మెల్యేలకు దక్కేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కార్పొరేట్ కంపెనీల పల్లెబాట

- ఏజెన్సీ గ్రామాల దత్తత
- ములుగు జిల్లాలో ఎనిమిది సంస్థల సేవలు
- మంత్రి సీతక్క చొరవతో ముందుకు
- సీఎస్ఆర్ నిధులతో సౌకర్యాల కల్పన



జాకారం గురుకులంలో డిజిటల్ ల్యాబ్

ములుగు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బహుళ అంతస్థుల భవనాలు.. సెంట్రల్ ఏసీ గదులు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కోట్లరూపాయల టర్నోవర్‌తో వ్యాపారాలు చేసే కార్పొరేట్ కంపెనీలు సామాజిక సేవా మార్గంలో పయనిస్తున్నాయి. పట్టణాలను వదిలి పల్లెలకు పయనమయ్యాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద నిధులు వెచ్చిస్తున్నాయి. గ్రామీణ ప్రజల మౌలిక అవసరాలను తీర్చుతున్నాయి. రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చొరవతో ఎనిమిది కంపెనీలు ములుగు జిల్లాలోని నాలుగు మండలాలు, 20కిపైగా పల్లెలను దత్తత తీసుకున్నాయి.

హైదరాబాద్ కేంద్రంగా వ్యాపారం చేస్తున్న మైక్రోసాఫ్ట్, ఏఎండీ, సింక్రోనీ, ఓపెన్ టెక్స్, ఆర్సిసిమ్, సర్వీస్‌నౌ, యూఎస్‌టీ సంస్థల ప్రతిని ధులను సంప్రదించిన మంత్రి సీతక్క ములుగు జిల్లా కు ఆహ్వానించారు. తమ సీఎస్ఆర్ నిధులతో మారు మూల గ్రామాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించడంతో జిల్లా యం త్రాంగాన్ని కార్యోన్ముఖులను చేశారు. సేవలు అవసర మైన గ్రామాలను గుర్తించి అక్కడ ప్రత్యేక గ్రామస భలను ఏర్పాటు చేయించారు. ప్రజల నుంచి వినతుల ను స్వీకరించి వారెదుర్కొంటున్న సమస్యలు, తక్షణ అవసరాలపై నివేదిక రూపొందించారు. ఈ క్రమంలో మైక్రోసాఫ్ట్, ఏఎండీ సంస్థలు ఏటూరునాగారం, ములుగు, తాడ్వాయి, మండలాల్లో ఏఎండీ సంస్థ, గోవిందరావుపేట, ములుగు మండలాల్లో ఓపెన్ టెక్స్, ఆర్సిసిమ్, యూఎస్‌టీ, వెంకటాపూర్ మండలంలో సర్వీస్‌నౌ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చాయి. నిర్మా ణ్ ఆర్గనైజేషన్ సంస్థ ఈ కార్పరేట్ సంస్థలకు సహకారం అందిస్తోంది.

పాఠశాలల్లో డిజిటల్ ల్యాబ్‌లు

విద్యా ప్రమాణాలు పెంచడానికి ఆయా సంస్థలు ప్రాధాన్యమిచ్చాయి. తాడ్వాయి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ములుగు మండలం జాకారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం, ములుగులోని కేజీబీవీ స్టెమ్ ల్యాబ్‌లు, ఏటూరునాగారంలోని గిరిజన బాలుర గురుకులంలో స్టెమ్ ల్యాబ్‌తోపాటు డిజిటల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశాయి. కంప్యూటర్లు, మ్యాథ్స్ సైన్స్ కిట్లు, అవసరమైన ఫర్నిచర్‌ను అందజేశాయి. గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 131 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు.



ఏటూరునాగారం గిరిజన బాలుర గురుకులంలో డిజిటల్ ల్యాబ్



గోవిందరావుపేటలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు (ఫైల్)

పల్లెవాసులకు మౌలిక సౌకర్యాల కల్పన

గోవిందరావుపేట మండలం ఎల్బీనగర్, చంద్రుతండా, ములుగు మండలం కొడిశలకుంట, జగ్గన్నపేట, జీవంతరావుపల్లి, పులిగుండం, జగ్గన్నగూడెం, వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి, నందిపహాడ్ గ్రామాలను దత్తత తీసుకున్న కంపెనీలు మౌలిక సౌకర్యాలు కల్పించాయి. బోరుబావులు, ఆర్‌వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశాయి. కొన్నిచోట్ల మినీ వాటర్ ట్యాంకులను నిర్మించారు. హెల్త్‌క్యాంపులు ఏర్పాటుచేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు మరమ్మతులు చేయించి, మూత్రశాలలు, రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాములు నిర్మించారు. సోలార్ సిస్టం, వీధి లైట్లు, పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్లను ఏర్పాటు చేశారు. మహిళలు, విద్యార్థులకు పోషకాహార కిట్లను అందజేశారు. రైతులకు పాడి గేదెలు, క్యాన్లు, ఇరువురు నిరుపేద యువకులకు జీవనోపాధి కోసం ఆటోలను అందించారు.

రేషన్ బియ్యం ఇచ్చేది మోదీ ప్రభుత్వమే

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సొమ్మొకరిది..సోకొకరిది అన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, తెలంగాణకు రేషన్ బియ్యం ఇచ్చేది కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో బలరాం మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014 నుంచి నేటివరకు దాదాపుగా 11 సంవత్సరాల కాలం వరకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలందరికీ దేశవ్యాప్తంగా ఉచిత రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నేడు ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేయడం ఉపయోగకరమని, ఆసన్న బియ్యం ఇస్తున్నది కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమని, ఈవిషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి దానిని సన్నబియ్యంగా తయారు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ ప్రజలకు ఐదు కిలోల చొప్పున బియ్యం అందిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ కేంద్రం ఇచ్చే నిధులతో పాలన సాగిస్తోందని విమర్శించారు. అదేవిధంగా రెండురోజుల క్రితం హైదరాబాద్‌లో హెచ్‌సీయూ విద్యార్థులు సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మొద్దని ధర్నాచేస్తే పోలీసులు విచక్షణారహి తంగా దాడి చేయడం అమానుషమని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జవహర్‌లాల్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు స్వరూప, జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజ్‌కుమార్, నాయకులు లవణ్ కుమార్, గాదం కుమారస్వామి, దొంతిరెడ్డి రవిరెడ్డి, రాయంచు నాగరాజు, అజ్మీరా కిషోర్‌నాయక్, లకావత్ రాజ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు అండగా ఉందాం

కిసాన్‌సెల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ రాజేందర్‌గౌడ్



నాయకులకు వివరాలు వెల్లడిస్తున్న రాజేందర్‌గౌడ్

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని వెంకటాపురం, వాజేడు మండలాల్లో నష్టపోయిన మొక్కజొన్న రైతులకు అండగా ఉందామని కిసాన్ సెల్ ములుగు నియోజకవర్గ కోఆర్డినేటర్ గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు సుంకెట అన్వేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కిసాన్ కాంగ్రెస్ సమావేశం జరగగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ మొక్కజొన్న రైతులకు సత్వర న్యాయం చేకూర్చాలని అన్నారు. నకిలీ విత్తనాల వల్ల పంట దిగుబడి రాక రైతులు అప్పులపాలయ్యారని, నిర్వాహకుల నిర్వాకం వల్లనే రైతులు నష్టపోయారని అన్నారు. విత్తనచట్టం అమలుచేసి విత్తన సంస్థలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే మంత్రి సీతక్క మొక్కజొన్న రైతులకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్నారని, రైతులను మోసం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులను మోసం చేయకుండా చట్టాలు తీసుకురావాలని, రైతులకు అధికారులు అండగా ఉండి మోసం చేసినవారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులపై లాఠీచార్జ్ అమానుషం : బీజేపీ

గోవిందరావుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులపై లాఠీచార్జి చేయడం అమానుషమని, కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని బీజేపీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకా శాలు కల్పించకుండా వారి భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని అన్నారు. పేద విద్యార్థులను చదువుకోకుండా చేసి వారిని ఉచితాల కోసం ఓటు వేయించే కుట్ర జరుగుతుందని, వారు చదువు ద్వారా అవగాహన పెంచు కుంటే కాంగ్రెస్ రాజకీయ ఎత్తుగడలు విఫలమవుతాయని ప్రభుత్వం భయప డుతోందని విమర్శించారు. ఉస్మానియా యూనివర్సిటీ భూముల వేలం ఆపకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

మల్హర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీవీనగర్ శివారులో రెండు జిల్లా సరిహద్దు మానేరు బ్రిడ్జి సమీపంలో ప్రమాదవశాత్తు కారు దగ్ధమైంది. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన వారు పని నిమిత్తం భూపాలపల్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పీవీనగర్ దాటిన తర్వాత కారులో నుంచి ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. దీంతో భయభ్రాంతులకు గురైన వెంటనే కారు దిగారు. చూస్తుండగానే మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో షార్ట్‌సర్క్యూట్ కావడం వల్లే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

అంబట్‌పల్లిలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : అంబట్‌పల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు ఎరవెల్లి విలాస్ రావు ఆధ్వర్యంలో శ్రీపాద స్మారక జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బ్లాక్ కాంగ్రెస్ నాయకులు కోట రాజబాబు, ఇతర కాంగ్రెస్ నాయకులు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి క్రీడలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వామన్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, కట్కూం అశోక్, చీమల సందీప్, దండేరా రాజేందర్, లేతకారి రాజు, అస్రర్ ఖురేషీ, శ్రీశైలం, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభోత్సవానికి ముందు శ్రీపాదరావుకు నివాళి అర్పిస్తున్న నేతలు

‘రాజీవ్ యువ వికాసం’ గడువు పొడిగింపు

కాటారం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 14వరకు పెరిగిందని ఎంపీడీవో అడ్డూరి బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.దరఖాస్తులను మండల పరిషత్‌లోని ప్రజా పాలన సేవా కేంద్రంలో మాన్యువల్‌గా సైతం ఇవ్వొచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టు




పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరణ్

కాటారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల అంశంలో విద్యార్థి సంఘాలు ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. పీఎస్సై గీత ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్‌తో పాటు తరుణ్, సాగర్‌ను అరెస్టు చేసి సాయంత్రం సొంత పూచీకత్తు మీద విడిచిపెట్టారు.

మూగజీవుల దప్పిక తీరేదెలా?

టేకుమట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నీటి తొట్లను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో రూ.20 వేల నుంచి 25 వేల వ్యయంతో వీటిని నిర్మించారు. అయితే.. వాటిలో నీళ్లను నింపడం మాత్రం విస్మరించారు. మండ లంలోని రామకిష్టాపూర్ (వి) గ్రామంలో నీరు లేక తొట్టి ఖాళీగా దర్శనమిస్తోంది. కొన్ని గ్రామాలలో నీటి తొట్లు వినియోగంలో లేకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. మరిన్ని గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకొని వినియోగించుకోవ డానికి వీలులేకుండా ఉన్నాయి. ఎండకాలంలో మూగజీవులకు దాహం తీర్చడమే లక్ష్యంగా నిర్మించిన నీటి తొట్లను వినియోగంలో తీసుకుచ్చేలా సంబంధిత అధికా రులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



రామకిష్టాపూర్ (వి)లో నీరులేక ఖాళీగాఉన్న తొట్టి

బొగ్గు వెలికితీత 75 శాతమే..

- టార్గెట్ పూర్తి చేసుకోని సింగరేణి
- భూపాలపల్లి ఏరియాలో 37,02,292 టన్నుల బొగ్గు ఉత్పత్తి
- వార్షిక నివేదిక వెల్లడించిన అధికారులు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా బొగ్గు ఉత్పత్తి సాధించడంలో వెనుకబడింది. లక్ష్యానికి చేరువైనప్పటికీ టార్గెట్‌ను పూర్తి చేసుకోలేదు. 2024-25 వార్షిక ఉత్పత్తిని 75 శాతమే సాధించింది. ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గనుల వారీగా బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించారు.

భూపాలపల్లి సింగరేణి ఏరియాలో నాలుగు భూగర్భ గనులు, రెండు ఓపెన్ కాస్టులు ఉన్నాయి. వీటి నుంచి 2024-25 సంవత్సరానికి సంస్థ 49 లక్షల 60 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించింది. దీంతో ఈ ఏరియాలో 37,02,292 టన్నుల బొగ్గు ఉత్పత్తిని మాత్రమే సాధించింది. మిగిలిన 1,25,7708 టన్నుల బొగ్గు ఉత్పత్తిని వెలికి తీయలేకపోయింది. కేటీకే-1 ఇన్‌క్లైన్‌లో 2 లక్షల 50 వేల టన్నుల లక్ష్యం ఉండగా 1,81,769 సాధించింది. కేటీకే-5లో 2 లక్షల 50 వేల లక్ష్యానికి, 1,98,874 టన్నులు, కేటీకే-6లో 1 లక్ష 80 వేల టన్నుల లక్ష్యానికి 1,27,014 టన్నులు, కేటీకే-8లో 2 లక్షల 80 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 1,85,356 టన్నులను ఉత్పత్తి చేసింది. అలాగే, ఓసీ-2లో 15 లక్షల టన్నులకు 14,67,133 టన్నులు, ఓసీ-3లో 25 లక్షల టన్నులకు 15,42,146 టన్నుల బొగ్గును మాత్రమే వెలికి తీసింది.

బొగ్గు, మట్టి రవాణా ఇలా..

సింగరేణి ఏరియా నుంచి ఉప్పల్‌తోపాటు ఇతరత్రా ప్రాంతాలకు తరలించే బొగ్గును నిర్దేశించిన లక్ష్యం కంటే సగభాగమే రవాణా జరిగింది. వార్షికంగా 6.39 లక్షల టన్నుల బొగ్గు రవాణా లక్ష్యం కాగా 3.89 లక్షల టన్నుల బొగ్గు రవాణా మాత్రమే చేపట్టారు. రోజువారీగా కనీసం 12,558 టన్నులతో 61 శాతం మాత్రమే బొగ్గు రవాణా చేశారు. ఓసీ-2, ఓసీ-3 నుంచి మట్టి వెలికితీత కూడా లక్ష్యాన్ని చేరుకోలేదు. ఓసీ-2 నుంచి 85 వేల క్యూబిక్ మీటర్ల మట్టి సేకరణ లక్ష్యం కాగా, 62,562 క్యూబిక్ మీటర్లు తీశారు. ఓసీ-3 నుంచి 70 వేల క్యూబిక్ మీటర్ల లక్ష్యం కాగా 54,895 క్యూబిక్ మీటర్లు వెలికితీశారు.

నష్టం రూ. 46 కోట్లకు తగ్గించాం..

- రాజేశ్వర్‌రెడ్డి, సింగరేణి జనరల్ మేనేజర్

భూపాలపల్లి సింగరేణి ఏరియా ప్రస్తుతం నష్టాల్లోనే కొనసాగుతోంది. రూ.398 కోట్ల నష్టంలో సంస్థ నడుస్తోంది. అయితే, ఈ 2024-25 వార్షికంలో నష్టం నుంచి రూ.46 కోట్లు తగ్గించి సంస్థకు ఒక విధంగా లాభాన్ని చేకూర్చాం. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. ఏరియాలో గైర్హాజరు శాతం 40 శాతం ఉంది. దీనిని నివారించేందుకు ఈ నెల 8న కార్మికులతోపాటు వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని భావిస్తున్నాం. అలాగే, సింగరేణి ఏరియాలోనే ప్రథమంగా అండర్‌గ్రౌండ్‌లోకి ఒక షిఫ్టు పూర్తిగా మహిళలకు కేటాయించేలా ప్రణాళికలు రూపొందించాం. రాబోయే 2025-26 వార్షిక నివేదిక లక్ష్యానికి అనుగుణంగా అధికారులు, కార్మికుల సమన్వయంతో ముందుకు సాగుతాం.

‘అట్రాసిటీ’ పరిహారం చెల్లింపుల్లో ప్రభుత్వ జాప్యం

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు సుకుమార్

మంగపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు, తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రాసమల్ల సుకుమార్ విమర్శించారు. దీంతో బాధితులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మంగపేటలో ఎస్సీ, ఎస్టీ కులాల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బాధితులు కోర్టులకు హాజరయ్యేం దుకు, ఇతరత్రా ఖర్చుల కోసం ప్రభుత్వ పరంగా పరిహారం అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం- 1989ను కేంద్ర ప్రభుత్వం 2016లో మరింత బలోపేతం చేసిందని తెలిపారు. దీని ప్రకారం బాధితులకు ప్రభుత్వ పరంగా మూడు విడతల్లో పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటా కింద బాధితులకు అందజేయాల్సి ఉంటుం దన్నారు. అట్రాసిటీ కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే 25 శాతం, పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగానే 50 శాతం, నిందితుడికి శిక్ష ఖరారైన తర్వాత మరో 25 శాతం పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే.. చాలా కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత 25 శాతం పరిహారం అందుతున్నప్పటికీ ఆ తర్వాత చెల్లించాల్సిన సొమ్ము అందడం లేదని బాధితులు వివరించారు. మరికొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైన పరిహారం చెల్లించడం లేదని తెల్పిందన్నారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేసి బాధితుల పరిహారం చెల్లించాలని సుకుమార్ కోరారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

ఖ్యాతరాజు రమేష్, తక్కళ్లపల్లి రాజు, నడిగోటి రాము, వెంకటేశ్వర్‌రెడ్డి, నరహరి బక్కిరెడ్డి, రేషన్‌షాపు డీలర్ రజిత, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

టేకుమట్లలో సన్నబియ్యం పంపిణీ

టేకుమట్ల (ఆంధ్రజ్యోతి) : సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుపేద కుటుంబాలకు ఒక్కో సభ్యుడికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం 41 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

గణపురంలో..

గణపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. అనంతరం 26 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, కాంగ్రెస్ నాయకులు రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ కుమార్, అశోక్, చోటే మియా, శివశంకర్, కట్కూరి శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలు.. గిరిజనేతరులకు చుట్టాలు

ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ జిల్లా కార్యదర్శి ఆదినారాయణ

మంగపేట, ఏప్రీల్ 1 (ఆంధ్రజ్యోతి) ఏజెన్సీ మండలాలైన వాజేడు, వెంకటాపురంలో గిరిజన చట్టాలు గిరిజనేతరులకు చుట్టాలుగా మారుతున్నాయని ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ జిల్లా కార్యదర్శి పోలేబోయిన ఆదినారాయణ విమర్శించారు.

మండలంలోని చుంచు పల్లిలో ఆ సంఘం అత్యవసర సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఆదివాసీ రైతులను మోసం చేసిన గిరిజనేతరులపై కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. బహుళజాతి విత్త నాల పేరుతో ఏజెన్సీ ప్రాంతంలో ఆర్గనైజర్లు అమాయక ఆదివాసీలను ఆసరాగా చేసుకొని కోట్లుదండుకొంటున్నారని ఆరోపించారు. రెండు మండలాల రైతులు సుమారు 400కు పైగా రైతులు దాదాపు రెండు వేల ఎకరాలు మొక్కజొన్న బహుజాతి కంపెనీలు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయా రన్నారు. వీరికి వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నకిలీ విత్తనాలు ఇచ్చిన డీలర్లు కంపెనీలపై నామమాత్రంగా కేసులు పెడితే సరిపోదని, పీడీ యాక్ట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలి

ట్రాన్స్‌జెండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు రూప



మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్స్ జిల్లా అధ్యక్షురాలు రూప

కాటారం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ట్రాన్స్‌జెండర్స్ ప్రస్తావన సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన వెకిలి చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నామని ట్రాన్స్‌జెండర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.రూప మండిపడ్డారు. ఇందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేష్టలపై మండలంలోని మద్దులపల్లిలో ట్రాన్స్‌జెండర్స్ మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రూప మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లను పదేళ్ల పరిపాలనా కాలంలో బీఆర్ఎస్ ఎన్నడూ పట్టించుకోలేదని విమర్శించారు. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవంగా బతికేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఎద్దేవా చేయడం దుర్మార్గ చర్య అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తమకు ఎన్నో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ కల్పిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పించారన్నారు. తమకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెకిలిగా నవ్వడం దారుణమని, ఇందుకు వారు వెంటనే క్షమాపణలు చెప్పాలని అన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు శాన్విత, ఫ్రూటీ, నిత్య, శానిష్ఠ, రస్నా, వరోదిని తదితరులు పాల్గొన్నారు.